968 టిఎంసిల నీటి వాటా

- వినియోగించుకునేలా ప్రాజెక్టుల నిర్మాణం
- బనకచర్ల ప్రాజెక్టును అన్ని దశల్లో అడ్డుకుంటాం
- మంత్రులు ఉత్తమ్, తుమ్మల, శ్రీధర్‌బాబు, పొన్నం, అడ్లూరి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరిలో తెలంగాణకు కేటాయించిన 968 టిఎంసిల నీటిని పూర్తిగా వినియోగించుకునేలా ప్రాజెక్టులు నిర్మిస్తామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ వద్ద రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఉత్తమ్ ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రామగుండం ఎత్తిపోతల పథకం ద్వారా అంతర్గాం, ముర్మూర్, బ్రాహ్మణపల్లి, ఎల్లంపల్లి, సోమనపల్లి, మద్దిరాల, తొట్లవానిపురం గ్రామాలకు, 17ఎల్ ద్వారా కుక్కలగూడురు, నిట్టూరు గ్రామాలకు మొత్తం 13 వేల ఎకరాలకు పైగా నీరు అందుతుందన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) కోసం రూ.1.10 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గత ప్రభుత్వం లక్ష కోట్లు వృథా చేసిందని, మూడు బ్యారేజీల మరమ్మత్తులు చేయడానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఇచ్చంపల్లి, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీలు నిర్మిస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో రేషన్ ద్వారా సరఫరా చేసిన బియ్యం అక్రమ రవాణాకు గురయ్యాయని, ప్రస్తుతం దేశంలో ఎక్కడా లేని విధంగా 3.17 కోట్ల మంది పేదలకు రూ.13 వేల కోట్లు ఖర్చు చేసి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, రామగుండం ప్రాంతంలో అదనంగా 6,500 కార్డులు మంజూరు చేశామని అన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మహిళలను కోటీశ్వరులు చేయడమే తమ లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వాల తప్పిదాలను సరి చేస్తున్నామని, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల మంథని, పెద్దపల్లి జిల్లాలో ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందలేదని విమర్శించారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణంతో 2.40 లక్షల ఎకరాలకు సాగునీరు స్థిరీకరణ అవుతుందని, కొత్తగా పది వేల ఎకరాలకు నీరందుతుందని తెలిపారు. రామగుండంలో ప్రయివేట్ పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తామని అన్నారు. లారీ యజమానుల సమస్యలు పరిష్కరించేందుకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. స్థానిక సింగరేణి ప్రభుత్వ భూములను రెగ్యులరైజ్ చేసి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా తాను ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తామని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గోదావరి జలాలు సముద్రంలో కలవకుండా ప్రతి నీటి బొట్టును ఉత్తర తెలంగాణకు తరలిస్తున్నామన్నారు. రామగుండం బస్టాండ్ అభివృద్ధి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కేశవపట్నం శ్రీ వెంకటేశ్వర గార్డెన్ అండ్ ఫంక్షన్ హాల్‌లో లబ్దిదారులకు మంత్రులు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణరావు, మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్, కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ఢిల్లీకి కాంగ్రెస్ నేతలు

- బిసి రిజర్వేషన్ల సాధన కోసం 6న ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలంటూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతున్నది. కేంద్రంతో తాడోపేడో తేల్చుకునేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సోమవారం ఢిల్లీకి ప్రత్యేక రైల్లో బయలుదేరనున్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కోరుతూ ఉభయ సభల్లో పార్టీ ఎంపిలు మంగళవారం వాయిదా తీర్మానాలు ఇవ్వనున్నారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎలివేటెడ్ కారిడార్లు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు రూ.650 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కారిడార్ పనులను వేగవంతం చేస్తున్నామని, త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో చింతలకుంట నుంచి పెద్దఅంబర్‌పేట రేడియో స్టేషన్ వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఇఇ ధర్మారెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి వనస్థలిపురం జంక్షన్ వద్ద ఆదివారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ కారిడార్ కింద రోడ్డు, మధ్యలో హైవే, పైభాగంలో మెట్రో రాకపోకల కోసం సదుపాయం ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి గడ్కరీని ఈ నెల 6న కలుస్తామని తెలిపారు. ఎంపిగా ఉన్నప్పుడే ఈ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేశానని, ఇప్పుడు ఆర్‌అండ్‌బీ మంత్రిగా పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు రెండు గంటల్లో చేరుకునేలా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామని కెటిఆర్ చెబుతున్నారని, ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్లు సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టి మోసం చేశారని ఆరోపించారు. బంగారు తెలంగాణ అని చెప్పి అప్పుల తెలంగాణ చేశారని తెలిపారు. బిసి రిజర్వేషన్లపై కేసీఆర్ పదేండ్లు మాట్లాడలేదని, ఇప్పుడు ఆయన బిడ్డకు బీసీ రిజర్వేషన్లతో ఏం పని అని ప్రశ్నించారు. అనంతరం రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. స్థానిక కాలనీవాసులు వందమందితో కలిసి నెల క్రితం మంత్రిని కలిశానని తెలిపారు. ట్రాఫిక్ పెరిగిన నేపథ్యంలో వాహన అండర్‌పాస్‌లకు బదులుగా ఫ్లైఓవర్లు అత్యవసరమని, ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు, కాలనీ వాసులు సురక్షితంగా రోడ్లు దాటేందుకు ఫ్లైఓవర్ల కోసం వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం వనస్థలిపురం చౌరస్తా రోడ్డు పరిశీలనకు రావడం అభినందనీయమని అన్నారు.

పంప్డ్ స్టోరేజ్‌నీ వినియోగంలోకి తీసుకురావాలి

- రాబోయే 20 ఏళ్లకు సరిపడా విదుత్పత్తికి ప్రణాళికలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



జెన్ కో, ట్రాన్స్ కో అధికారులతో మాట్లాడుతున్న భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైడల్ పవర్‌తో పాటు పంప్డ్ స్టోరేజ్‌తో పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని, దానికోసం రాష్ట్రంలో ఇరవై మూడు పాయింట్స్‌ను గుర్తించి వాటి మీద సమగ్రమైన రిపోర్టు ఇవ్వాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పరిధిలోని సోమశిల వద్ద జెన్ కో, ట్రాన్స్ కో అధికారులతో భట్టి సమీక్ష నిర్వహించారు. జూరాల నుంచి పులిచింతల వరకు కృష్ణానది మీద ఉన్న హైడల్ పవర్ ప్రాజెక్టులను సమీక్ష చేసి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. అవసరం అయితే ప్రపంచ ప్రఖ్యాతగాంచిన కన్సల్టెంట్ల సేవలను ఉపయోగించుకోవాలని ఆదేశించారు. సోలార్ ద్వారా పగలు జరిగే ఉత్పత్తిని స్టోరేజ్ చేసి రాత్రివేళ ఉపయోగానికి అవసరమైన సాంకేతికను, దానికి అవసరమైన స్టోరేజ్ వ్యవస్థను రూపొందించుకోవాలన్నారు. ముందుచూపుతో అత్యాధునికమైన సాంకేతికతను పరిచయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం 1978లోనే ఆనాటి పాలకులు, ఇంజనీర్లు లోతుగా అధ్యయనం చేసి రివర్స్ పంపింగ్ కోసం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జపాన్‌కు చెందిన తొషిబా, మిస్టుబుషి లాంటి దిగ్గజ సంస్థల సాంకేతికతను ఉపయోగించిన తీరును, వారి ముందుచూపును కొనియాడారు. రాబోయే తరాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ హితమైన పవర్‌ను ఉత్పత్తి చేసి అందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఏటేటా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని రాబోయే 20 ఏండ్లకు సరిపడా విద్యుత్తు డిమాండ్‌కు అవసరమైన ఉత్పత్తిని అందుకోవడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. కాగా, ఈ ఏడాది డిమాండ్‌కు అనుగుణంగా నిరంతరాయంగా విద్యుత్‌ను అందించిన సిబ్బందిని డిప్యూటీ సిఎం అభినందించారు. సిఎండి నుంచి కింది సిబ్బంది దాకా వాళ్లకి అవసరమైన సాంకేతికతను పెంపొందించడానికి అవసరమైన సిలబస్‌ను రూపొందించి మూడు రోజుల ట్రైనింగ్ నిర్వహించాలని సూచించారు.

ఆదివాసీ గిరిజనుల హక్కుల కోసం పోరాడిన నేత సున్నం రాజయ్య

- నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసిన మహనీయుడు
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఐదో వర్ధంతిలో వ్యకాస, రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసీ, గిరిజనుల హక్కుల కోసం జీవితాంతం పోరాడటంతో పాటు నమ్మిన సిద్ధాంతం కడదాకా నిలిచిన మహనీయుడు భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్‌నాయక్ కొనియాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్ అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఐదో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు హక్కు పత్రాలు కావాలని ఫారెస్ట్ అధికారుల వేధింపులు ఆపాలనీ, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని అటు బయటా, అటు శాసనసభలో రాజయ్య పోరాటం చేశారని గుర్తుచేశారు.

ప్రజా ఉద్యమాలు ఎక్కడ జరిగితే అక్కడ రాజయ్య ఉండేవారని కొనియాడారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారనీ, పున్నయ్య కమిషన్ సాధనతో పాటు అంటరానితనం మీద రాష్ట్రవ్యాప్త పర్యటన చేసేటట్లుగా ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారని గుర్తుచేశారు. అసైన్‌మెంట్ భూముల పరిరక్షణ కోసం కోనేరు రంగారావు కమిటీని ప్రకటించడంలో రాజయ్యది కీలకపాత్ర అని కొనియాడారు. కార్యక్రమంలో వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు బి పద్మ, ఎ నరసింహులు, లంక రాఘవులు, ఆలిండియా కౌన్సిల్ సభ్యులు సరోజ, రాష్ట్ర నాయకులు కడియాల మోహన్, నరసింహ, బంధం శ్రీను, నాగేశ్వరరావు, స్వరాజ్యం, పాల్గొన్నారు.

ఆగస్టులోగా 'నారాయణపూర్' భూసేకరణ నిధులిస్తాం

- 3.17 కోట్ల మందికి నెలకు 6 కిలోల సన్నబియ్యం సరఫరా : మంత్రి ఉత్తమ్



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆగస్టులోగా 'నారాయణపూర్' భూసేకరణ నిధులిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ నీటి హక్కులను హరిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తానూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గోదావరి వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సిడబ్ల్యుసి వద్ద ఫిర్యాదు చేసి ప్రాజెక్టును అడ్డుకున్నామని, ప్రభుత్వ అభ్యంతరాలతో ఆ ప్రతిపాదనను తిరస్కరించారని తెలిపారు. ఈ అంశాన్ని అన్ని వేదికలపైనా, న్యాయపరంగానూ వ్యతిరేకిస్తామని పునరుద్ఘాటించారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండల కేంద్రంలో కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ పామెలా సత్పతితో కలిసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా చొప్పదండి నియోజకవర్గానికి చెందిన పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 3.17కోట్ల మందికి నెలకు 6 కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని తెలిపారు. దేశంలో 84శాతం జనాభాకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 8.64లక్షల కొత్త రేషన్‌కార్డులు జారీ చేయగా మొత్తం కార్డు సంఖ్య 98.58లక్షలకు చేరిందని వెల్లడించారు. నారాయణపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టు భూసేకరణకు అవసరమైన నిధులను ఆగస్టు నెలలోనే మంజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రిజర్వాయర్ పూర్తి చేయడం ద్వారా చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. గత ప్రభుత్వం 90 శాతం పనులు పూర్తి చేసి మిగిలిన 10 శాతం పనులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ ఎండీ చౌహాన్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసం పథకాన్ని అమలు చేయాలి

- ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకం కింద రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలిస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదని విమర్శించారు. బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లు కూడా కేటాయించి ఇవ్వడం మరిచిపోయిందన్నారు. ఇప్పటికే ఆ పథకంలో భాగంగా 16, 25,000కు పైగా నిరుద్యోగులు దరఖాస్తు చేసుకుని రుణాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లబ్దిదారులకు ఇస్తామని ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. సిబిల్ స్కోరు లేకున్నా నిరుద్యోగ యువతకు ఈ పథకాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఆయా శాఖల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు గడ్డం వెంకటేష్, మల్లం మహేష్, తిరుపతి, కార్తీక్, తిరుపతి నాయక్, శివ వర్మ, హరికృష్ణ, రమేష్, సాంబమూర్తి, హస్మిబాబు, సాగర్, మధు, మహేష్, వీరబాబు, నరేష్, నవీన్, శ్రీకాంత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ జాతీయ మహాసభలు

- సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత మత్స్యకారులు, మత్స్య కార్మికుల సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్) జాతీయ మహాసభలు ఈ నెల ఆరు, ఏడు తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో జరుగబోతున్నాయని, తెలంగాణ నుంచి 20 మంది ప్రతినిధులు బయలు దేరారని ఆ సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో మత్స్య వృత్తి జీవనాధారంగా ఆరు కోట్ల మంది మత్స్యకారులు, మత్స్యకార్మికులు ఉపాధి పొందుతున్నారని చెప్పారు. మత్స్య సంపద, దాని ఆధారిత ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా దేశానికి కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యం ఆదాయంగా వస్తున్నదని వివరించారు. ఎంతో కష్టపడుతున్నప్పటికీ వారి జీవనవిధానం మాత్రం అధ్వాన్నంగా ఉందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత్స్యకారుల హక్కులను కాలరాస్తున్నదని, వారికి లబ్దిచేకూర్చే సంక్షేమ పథకాలను ఎత్తేసిందని విమర్శించారు. వెంటనే ఆ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నాలుగో అఖిల భారత మత్స్యకారుల జాతీయ మహాసభల్లో భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చనమొని శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు గొడుగు వెంకట్, ఎం రమేష్, టి ఇస్తారి మత్స్య మహిళా విభాగం రాష్ట్ర కో-కన్వీనర్ బక్కి బాలమణి, గాండ్ల అమరావతి పాల్గొన్నారు.

వ్యవసాయేతర కార్మికుల సమస్యలపైనా పోరాటం

- అడ్డా కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి : ఆర్ వెంకట్రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న వ్యవసాయేతర కార్మికుల సమస్యలపైనా పోరాటం చేయనున్నట్టు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ ఖసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.పద్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు పెద్ద ఎత్తున వలసొస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని అడ్డా కార్మికులందరికీ గుర్తింపు కార్డులివ్వాలనీ, వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పనిప్రదేశాల్లో మహిళా కూలీలపై లైంగిక వేధింపులు, శ్రమదోపిడీ పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వారికి పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కూడా లేవని వాపోయారు. స్థిర నివాసం లేక పిల్లలు చదువులకు దూరమవుతున్నారనీ, వారికి పట్టణాల్లో అద్దెకు ఇండ్లు కూడా ఇవ్వట్లేదని ఎత్తిచూపారు. పని ప్రదేశంలో చనిపోతే ఆదుకునే వారే లేరన్నారు. ప్రతి అడ్డా కూలీకి ప్రమాద బీమా వర్తింపజేయాలనీ, పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, సాంబశివ, లంకా రాఘవులు, నరసింహులు, సరోజ, నరసింహ, మల్లేష్, మోహన్, స్వరాజ్యం, స్వరూప, బంధం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సిఎం రేవంత్ బిజెపి ఏజెంట్

- ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ ఇంఛార్జి ప్రియాంక కక్కార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిజెపి ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ ఇంఛార్జి ప్రియాంక కక్కార్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సిఎం చర్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని ప్రజాస్వామ్య విలువల గురించి నిత్యం వల్లెవేసే కాంగ్రెస్ యువనేత రాహుల్ ఆ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయింపుల గురించి రేవంత్ చర్యలను ఎందుకు అదుపు చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. డిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఇచ్చిన హామీలను కాపీ కొట్టి దొడ్డిదారిన రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఆ పార్టీ... వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఒక మాట, కేంద్రంలో మరో మాట మాట్లాడుతూ ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నందున ఇండియా కూటమి నుంచి బయటకొచ్చినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి

- రేపు ఇందిరా పార్కు వద్ద ధర్నా
- బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం.. బిజెపి ఎంపిలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి.. లేదంటే రాజీనామా చేయాలి
- ఈ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి అందర్నీ కలుపుకుని పోవాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఐక్యపోరాటాలకు సన్నద్ధం కావాలని, మంగళవారం ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహాధర్నాను ప్రజలంతా జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఈ విషయంలో రాష్ట్రం నుంచి ఎన్నికైన బిజెపి ఎంపిలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలనీ, లేదంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందర్నీ కలుపుకుని ముందుకు సాగాలని సూచించారు. ఆదివారం ఈ మేరకు జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. "రాష్ట్రంలో కులగణన పూర్తయింది. దాని ఆధారంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టగా అన్ని పార్టీలూ మద్దతిచ్చాయి. రాష్ట్ర సర్కారు బిల్లును కేంద్రానికి పంపింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది. రాష్ట్ర సర్కారు ఆర్డినెన్స్‌ను పంపిస్తే గవర్నర్ జాప్యం చేస్తున్నారు. దీనివల్ల స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఆలస్యమవుతున్నది. దాన్ని సాకుగా చూపెట్టి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను కేంద్రం అడ్డుకుంటున్నది. బిసి రిజర్వేషన్లలో ముస్లిములను తొలగించాలనే అక్రమ డిమాండ్‌ను బిజెపి ముందుకు తీసుకొస్తోంది. గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ లాంటి బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేస్తూ తెలంగాణలో మాత్రం అమలు చేయకూడదని అడ్డుతగలడమేంటి? దీనిపై సామాజిక న్యాయం కోరే శక్తులన్నీ దీన్ని ఆలోచించాలి. ముస్లింలలో దూదేకుల, అత్తర్‌సాహెబ్, రాళ్లు కొట్టుకుని బతికేవాళ్లు (కాసోళ్లు), ఫకీర్ల లాంటి చిన్నచిన్న వృత్తులు చేసుకునేవారికి బిసి రిజర్వేషన్లు అమలవుతున్నాయి. డబ్బున్న ధనిక వర్గాలకు కాదు. హిందూ బిసిలకు రిజర్వేషన్లు అమలు చేసి, ఇస్లాం స్వీకరించిన బిసిలకు రిజర్వేషన్లు ఉండకూడదన్నది ఎట్లాంటి న్యాయం? అది సామాజిక న్యాయం ఎలా అవుతుంది? రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైంది. ప్రభుత్వరంగాన్ని ప్రయివేటుపరం చేస్తూ, మొత్తం రిజర్వేషన్లను నిర్లక్ష్యంచేస్తూ బిజెపి రాజ్యాంగాన్ని నిరుపయోగంగా మారుస్తోంది. అందులో భాగంగానే బిసిల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. బిసిలకు అనుకూలమంటూనే బిజెపి నాయకులైన బండి సంజయ్, కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బిజెపి ఎంపిలున్నారు. 42 శాతం బిసిలకు రిజర్వేషన్లు అమలు జరపడానికి కేంద్రం మీద ఒత్తిడి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలి కదా? అలా కాకుండా ఈ రిజర్వేషన్లకు అడ్డుపడే చర్యలకు బిజెపి పాల్పడుతోంది. రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు పార్లమెంటులో రిజర్వేషన్లకు అనుకూలంగా వ్యవహరించక పోతే వారి రాజీనామాకు ఒత్తిడి చేస్తూ ఆందోళనకు పూనుకుంటాం. సిపిఎం ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనా కార్యక్రమా లను నిర్వ హిస్తున్నది. పార్లమెంటులో బిల్లును ఆమోదించాలని, చట్టం చేయాలని మంగళవారం ఇందిరాపార్కు దగ్గర మహాధర్నాను నిర్వహిస్తున్నాం. సామాజికన్యాయం కోరే శక్తులు, ప్రజానీకం అట్లాగే బిజెపి, బిసి రిజర్వేషన్ల వ్యతిరేక విషయాలన్నింటిన్ని కూడా ప్రచారం చేయడానికి, ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి ఈ ధర్నాకు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం' అని పేర్కొన్నారు.



నిలోఫర్ టీ పొడర్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఉద్యోగావకాశాలు

- జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫ్యాక్టరీ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లి పారిశ్రామికవాడలో నూతనంగా నిలోఫర్ బాబురావు నిర్మించిన నిలోఫర్ టీ పౌడర్ ఫ్యాక్టరీని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫ్యాక్టరీల ఏర్పాటుతో పలువురికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావాలి చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

పాదయాత్ర కోసం రైతుల అరెస్ట్ అన్యాయం

- బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాద యాత్ర కోసం రైతులతో పాటు బిఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఎ. జీవన్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని, పాదయాత్రలో జనం ప్రశ్నిస్తారనే భయంతో అరెస్ట్‌లకు దిగారని విమర్శించారు. ఆర్మూర్ లో అప్రకటిత ఎమర్జెన్సీ ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేనైన నాపైనే 40 కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్‌కు నీటి పారుదల శాఖపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. భూ దందాలు, అక్రమ వసూళ్లకు పాల్పడుతూ కాంగ్రెస్ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అన్ని విభాగాలు అవినీతిలో కూరుకు పోయాయనీ, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మాటలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన రైతులను, బిఆర్ఎస్ కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలిన డిమాండ్ చేశారు.



రాస్తారోకో చేస్తున్న భూ నిర్వాసితులు

నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల భూ నిర్వాసితుల రాస్తారోకో

- వారి పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది
- భూ నిర్వాసితుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధరకనుగుణంగా పరిహారం అందివ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో బస్టాండ్ రోడ్డు వద్ద భూ నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భూనిర్వాసితుల సంఘం జిల్లా కార్యదర్శి కేశవ్ గౌడ్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. 20 రోజులుగా భూ నిర్వాసితులు జిల్లా కేంద్రంలో రిలే దీక్షలతో పాటు జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేసినా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తామన్న ఎకరాకు రూ.14 లక్షల పరిహారం ఆమోదయోగ్యం కాదని, ఆ డబ్బుతో భూమి కొనే పరిస్థితి లేదని అన్నారు. ప్రాజెక్టులకు భూములు ఇస్తున్న భూనిర్వాసితులకు అన్యాయం చేయెుద్దని, వారిని శాశ్వత వలసదారులుగా తయారు చేయెుద్దని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విధాలుగా వెనుకబడి గురైన నారాయణపేట ప్రాంతానికి ఈ ఎత్తిపోతల పథకం ఎంతో ఉపయోగపడుతుందని, కానీ అదే స్థాయిలో భూనిర్వాసితులకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం అందించేలా న్యాయ కమిషన్ ఏర్పాటు చేయాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేసి నిర్వాసితులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోరారు. లేకుంటే భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం నాయకులు పుంజనూర్ ఆంజనేయులు, సిఆర్ గోవింద్ రాజ్, కాట్రేపల్లి, కార్చ్వర్ ఎర్నాగుపల్లి గ్రామ నాయకులు ఆంజనేయులు, హనుమంతు, నరసింహులు, కృష్ణ, మాలగజలప్ప, జిలానీ, నారాయణ గౌడ్, సత్యనారాయణ గౌడ్, అంజప్ప, బొంబాయి సోమన్న తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి, కెసిఆర్ దేశంలోనే నెంబర్ వన్ మోసగాళ్లు

- పెన్షన్లు పెంచకుంటే సిఎం రాజీనామా చేయాలి : మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సభలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ దేశంలో నెంబర్ వన్ మోసగాళ్ళని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి పెన్షన్లు పెంచకుండా వృద్ధులు, వికలాంగులను మోసం చేస్తుంటే.. ప్రతిపక్ష నాయకుని హెూదాలో ఉండి కూడా కేసీఆర్ మౌనం వహిస్తూ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ శోభ గార్డెన్లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఆయన హాజరై ప్రసంగించారు. వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా సిఎం రేవంత్ రెడ్డి పెన్షన్లు పెంచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పటినుంచే పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా పేదల గురించి కెసిఆర్ అడగడం లేదని, ఇప్పటికైనా మౌనం వీడాలని అన్నారు. ప్రతిపక్ష నాయకుని పాత్రలో కెసిఆర్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. 2007 నుంచి వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రారంభించి పేదల కోసం పోరాడానని, ఆ ఫలితంగానే ప్రస్తుతం ప్రభుత్వాలు పెన్షన్లు ఇస్తున్నాయన్నారు. ప్రజలను మోసం చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్షనేత కెసిఆర్‌కుకే వచ్చే స్థానిక ఎన్నికల్లో ఓటేయెుద్దని పిలుపునిచ్చారు. పింఛన్ పెంచుతావా లేక రాజీనామా చేస్తావా తేల్చుకోవాలని సిఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. పెన్షన్ల పెంపు సాధన కోసం ఆగస్టు 13న హైదరాబాద్‌లో భారీ సభను నిర్వహిస్తున్నామని, దాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కామల్ల భూమయ్య, ఎంఎస్‌పి జాతీయ నాయకులు మంద కుమార్, జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మొక్కపల్లి రాజు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు బుడిగే మహేష్ మాదిగ, జిల్లా కార్యదర్శి ఉబ్బని ఆంజనేయులు, టిజిడిజె ఎసి బాబు, దుర్గయ్య, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రేక్స్ ఫెయిలవ్వడంతో దుకాణాలపైకి దూసుకెళ్లిన లారీ

- ఇద్దరు మృతి, ఒకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్రేక్స్ ఫెయిలవ్వడంతో లారీ అదుపుతప్పి రోడ్డుపై ఉన్న పాన్‌షాప్, టీస్టాల్‌లోకి దూసుకురావడంతో ఇద్దరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ జిల్లా కోహిర్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిలమామిడి రామకృష్ణ (35), చిలమామిడి శ్రీసాయి (30) ఆదివారం మధ్నాహ్నం భువనగిరి జిల్లా కేంద్రంలోని సంతోష్‌నగర్‌లో ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్‌కు వచ్చారు. స్వీట్స్ కొనుగోలు చేసేందుకు జగదేవ్‌పూర్ చౌరస్తాకు వచ్చి.. కొనుగోలు చేస్తుండగా రాజస్తాన్‌కు చెందిన ఓ లారీ బ్రేక్స్ ఫెయిలవ్వడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న పాన్‌షాప్, టీస్టాల్‌లోకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీసాయికి తీవ్రగాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. అదేవిధంగా రామన్నపేట మండలంలోని తుమ్మలగూడెంకు చెందిన శివకు కూడా గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. పాన్‌షాప్, టీస్టాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. పోలీసులు క్రేన్ సహాయంతో లారీని అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెరీన్ ఆచార్జ్ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ కలకలం

- డ్రగ్స్, మద్యం పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామ శివారులోని సెరీన్ ఆచార్జ్ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ కలకలం రేపింది. పుట్టినరోజు వేడుకల పేరుతో ఫామ్‌హౌస్‌ను బుక్ చేసుకొని అందులో డ్రగ్స్, ఖరీదైన మద్యంతో ఎక్సైజ్ శాఖకు ఆరుగురు ఐటీ ఉద్యోగులు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అభిజిత్ బెనర్జీ అనే వ్యక్తి పుట్టినరోజు సందర్భంగా సెరీన్ ఆచార్జ్ ఫామ్‌హౌస్ బుక్ చేసుకున్నారు. ఐదు ఖరీదైన మద్యం బాటిళ్లతో డ్రగ్స్ తీసుకుంటూ మద్యం తాగుతూ ఎంజాయ్ చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్‌జీఎఫ్‌బీ టీం, సీఐ భిక్షపతి, ఎస్ఐ బాలరాజు సిబ్బందితో కలిసి ఫామ్‌హౌస్‌పై దాడి చేశారు. ఈ దాడిలో రూ.రెండు లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ కిట్స్‌తో పరీక్షలు నిర్వహించగా అందరికీ పాజిటివ్ వచ్చింది. అభిజిత్ బెనర్జీ, సింపుల్ ప్రతాప్, గోయల్ జస్వంత్, దినేష్ వ్యక్తులతో పాటు ఫామ్‌హౌస్ నిర్వాహకునిపై కేసు నమోదు చేశారు. వీరిని చేవెళ్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. నిందితుల నుంచి రూ.50 లక్షల విలువైన మూడు కార్లను, రెండు లక్షల విలువైన డ్రగ్స్, మద్యం స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ పార్టీని విఫలం చేసిన ఎస్‌జిఎఫ్‌బి బృందంను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాస్ కాసిం అభినందించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- విద్యార్థిని మృతిపై విచారణ జరిపించాలి
- కళాశాల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హనుమకొండ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని కళాశాలలోనే ఉరి వేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. కాగా, విద్యార్థిని కుటుంబీకులకు ఎలాంటి సమాచారం అందించకుండానే మృతదేహాన్ని కళాశాల యాజమాన్యం వరంగల్ ఎంజిఎంకు తరలించడంతో కళాశాలపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాలకు చెందిన మిట్టపల్లి శివాని (16) హనుమకొండ నయీమ్‌నగర్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలోనే కళాశాలలో ఉరేసుకుని మృతిచెందడం కలకలం రేపుతోంది. ఇదిలా ఉంటే మృతురాలు రాసిన సూసైడ్ నోట్ సంఘటన స్థలంలో లభ్యమైంది. 'కళాశాలలో చేర్చే ముందు ఒక్కసారి ఆలోచించాలి.' అని ఆ లేఖలో శివాని తన అవేదనను వ్యక్తం చేసింది. కానీ, ఈ సూసైడ్ నోట్ తమ కూతురిది కాదని మృతురాలి తల్లి అంటోంది. దాంతో విద్యార్థిని మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సమగ్ర విచారణ జరపాలి : ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్

విద్యార్థిని ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడారు. విద్యార్థి శివాని ఆత్మహత్యపై పోలీసులు సమగ్రమైన విచారణ జరిపించి, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్, కార్పొరేటు విద్యా సంస్థలు విద్యార్థులను చదువుల పేరుతో, అధిక ఫీజుల పేరుతో ఒత్తిడికి గురిచేస్తూ వారి ప్రాణాలు తీసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. శివాని అనే అమ్మాయి ఆదివారం ఉదయం 7:30గంటలకు చనిపోతే 12 గంటల వరకు విద్యార్థి తల్లిదండ్రులకు ఎస్ఆర్ విద్యా సంస్థ యజమాన్యం చెప్పకుండా విద్యార్థి మృతదేహాన్ని ఎంజిఎం ఆస్పత్రికి తరలించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, విద్యాశాఖ అధికారులు స్పందించి వెంటనే విచారణ చేపట్టాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయికుమార్, మల్లేష్, పవన్, రాహుల్, అజయ్, వినయ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- త్వరలో రామయంపేటకు గైనకాలజిస్టును నియమిస్తాం : జిల్లా కలెక్టర్
- సైకిల్‌పై 22 కిమీ ప్రయాణించిన రాహుల్ రాజ్ దంపతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సైకిల్‌పై వెళుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు

మెదక్ జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలతో అధికారులను అలర్టుగా ఉంచుతూ, ఆకట్టుకుంటున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తన సతీమణితో కలిసి ఆదివారం జిల్లా కేంద్రం నుంచి ఏకంగా 22 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించి రామాయంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ హెూదాలో ఇలా సైకిల్‌పై ప్రజల మధ్య పర్యటించడం అందరినీ ఆకట్టుకుంది. గతంలోనూ ఇలా తన సతీమణితో కలిసి రామాయంపేట బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ అనూహ్య పర్యటనలో ఆయన ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

సైకిల్‌పై రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్న కలెక్టర్.. నేరుగా రోగుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అందుతున్న వైద్యం, ఆస్పత్రి సిబ్బంది పనితీరు, పరిశుభ్రత వంటి అంశాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది హాజరు పట్టిక, రోజు ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాల రికార్డులు పరిశీలించారు. అంటువ్యాధుల నియంత్రణపై సూచనలు చేశారు. ఆస్పత్రిలో త్వరలో గైనకాలజిస్ట్‌ను నియమించి, ప్రసవాల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, కలెక్టరేట్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా సిబ్బంది సమయపాలన పాటించేలా చూస్తున్నామని చెప్పారు. జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాలేదని, డెంగ్యూ కేసులు అక్కడక్కడ ఉన్నా, ప్రమాదకర స్థాయిలో లేవన్నారు. వర్షాకాలం నేపథ్యంలో జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

765 డిజి హైవేపై రోడ్డు భద్రత చర్యలకు ఆదేశిస్తాం

రోడ్డు భద్రతకు సంబంధించి కూడా జిల్లాలో చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలను గుర్తించి, అక్కడ ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 765 డిజి జాతీయ రహదారిపై కూడా కొన్ని చోట్ల సూచిక బోర్డులు ఉన్నా, ఇంకా భద్రత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నట్టు గుర్తించామని అన్నారు. వాటన్నింటిని త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు.

పాతనగరంలో మెట్రో విస్తరణ పనులు వేగవంతం

- ప్రభావిత ఆస్తుల సంఖ్య 1100 నుంచి 900కు కుదింపు
- పిల్లర్ల మార్కింగ్ పనులు షురూ..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పిల్లర్ల మార్కింగ్ చేస్తున్న దృశ్యం

ఎంజిబిఎస్ నుంచి చాంద్రాయణగుట్ట మధ్య మెట్రో రైల్ కారిడార్ ఏర్పాటుకు సంబంధించిన రోడ్ విస్తరణ పనులు వేగవంతమయ్యాయి. 7.5 కిలోమీటర్ల మార్గంలో అలైన్‌మెంట్ అద్భుతంగా ఉండేలా చర్యలు చేపట్టామని, ఈ రూట్లో రోడ్ విస్తరణ వల్ల ప్రభావితమయ్యే ఆస్తుల సంఖ్యను తగ్గించేలా మార్గాన్ని రూపకల్పన చేశామని హెచ్ఎంఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. మెట్రో పనులకు సంబంధించి ఇంజనీరింగ్, రెవిన్యూ అధికారులతో రోజువారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముందు అనుకున్న అంచనా ప్రకారం 1100 ఆస్తులు ఈ విస్తరణలో కూల్చాల్సి ఉంటుందని భావించామని, కానీ అలైన్‌మెంట్‌ను ఇంజనీరింగ్ నవకల్పన ద్వారా సరిదిద్దటం వల్ల ఆ సంఖ్య 900 వరకు తగ్గిందని చెప్పారు. వీటిలో ఇప్పటికే 412 ఆస్తులకు సంబంధించిన అవార్డులు జారీ చేశామని, 380 ఆస్తుల కూల్చివేతలు ఇప్పటివరకు పూర్తయ్యాయని, వీటి కోసం రూ.360 కోట్ల నష్టపరిహారం చెల్లించినట్టు తెలిపారు. ప్రభావిత ఆస్తులను స్వాధీనం చేసుకుంటూ, కూల్చివేతలు చేసి అవశేషాలను తొలగించడంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించి పనులు ముమ్మరంగా చేపడుతున్నామని మెట్రో ఎండి తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గులాబీ జెండా ఖాయం

- కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండా ఎగుర వేయడం ద్వారా కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ పాల్గొని మాట్లాడారు. గ్రేటర్‌లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టారనే కక్ష్యతో సీఎం రేవంత్ రెడ్డి పేదల ఇండ్లను కూల్చుతున్నారని ఆరోపించారు. సీఎం కొడంగల్ నియోజకవర్గంలో ఎఫ్‌టీఎల్‌లో ఇల్లు కట్టుకున్నాడని, హైదరాబాద్‌లో రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టిఎల్‌లోనే ఉందని గుర్తు చేశారు. అధికారులు వాటిని ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ గెలిచిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయనీ, మళ్లీ ఉపఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క ఓటు వేసినా ఉన్న పథకాలన్నీ పోతాయన్నారు.

ఘటనతో సర్కార్ యాక్షన్ ప్లాన్

- మూడు రోజులపాటు ఫెర్టిలిటీ సెంటర్లపై దాడులు
- రంగంలోని 35 ప్రత్యేక బృందాలు
- గ్రేటర్‌లో తనిఖీలు షురూ..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరోగసీ పేరుతో శిశువుల అక్రమ రవాణాకు పాల్పడిన 'సృష్టి ఫెర్టిలిటీ సెంటర్" ఘటనతో రాష్ట్ర ప్రభుత్వం అలర్టయింది. సరోగసీ దందాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఫెర్టిలిటీ సెంటర్లలో అసలు ఏం జరుగుతుందో తెలుసుకోవాలని, అనుమతులు, నిబంధనలు పాటిస్తున్నాయా..? లేదా..? అనే విషయాలపై ఆరా తీసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. మొదటగా గ్రేటర్ హైదరాబాద్, ఆ తర్వాత రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో తనిఖీలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నుంచే గ్రేటర్ హైదరాబాద్‌లోని ఫెర్టిలిటీ సెంటర్లలో ప్రత్యేక బృందాలు తనిఖీలు మొదలు పెట్టాయి. ఈ తనిఖీలు శనివారం, ఆదివారం, సోమవారం మూడ్రోజులపాటు కొనసాగనున్నాయి. నాలుగవ రోజు మంగళవారం ప్రభుత్వానికి నివేదిక అందజేసిన తర్వాత రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ తనిఖీలు చేపట్టనున్నారు.

గ్రేటర్‌లో 157 సెంటర్ల గుర్తింపు

రాష్ట్రంలో కొన్నేండ్లుగా ఫెర్టిలిటీ సెంటర్ల సంఖ్య భారీగా పెరిగింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలతోపాటు వరంగల్, కరీంనగర్ వంటి నగరాల్లోనూ ఈ కేంద్రాలు ఎక్కువగా వెలిశాయి. మొదటి దశలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గుర్తించిన 157 ఫర్టిలిటీ సెంటర్లలో ప్రత్యేక బృందాలు తనిఖీలు మొదలు పెట్టాయి. మూడు రోజుల్లో ఈ తనిఖీలను ముగించిన తర్వాత రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని ఫెర్టిలిటీ సెంటర్లలో దాడులు నిర్వహించనున్నారు. ఇందుకు 35 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ప్రతి బృందంలో ఒక వైద్య నిపుణుడు (డాక్టర్), ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఇతర అధికారులు ఉంటారు. ఈ బృందాలు మొత్తం 29 కీలక అంశాలను పరిశీలిస్తున్నాయి.

29 అంశాల చెక్ లిస్టుతో రంగంలోకి..

ఈ ప్రత్యేక బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫెర్టిలిటీ సెంటర్లలో సోదాలు నిర్వహించి, నిబంధనలను పరిశీలించనున్నారు. ఈ తనిఖీల కోసం 29 అంశాలతో కూడిన ప్రత్యేక చెక్ లిస్టును రూపొందించారు. ఈ చెక్ లిస్ట్‌లో లైసెన్స్‌ల పరిశీలన, క్వాలిటీ ట్రీట్‌మెంట్, పేషంట్స్ రికార్డ్ నిర్వహణ, మందుల నిల్వ, సిబ్బంది అర్హతలు, శస్త్రచికిత్సల భద్రతా ప్రమాణాలు, వైద్య విధానాలు, సరోగసీ వంటి నిబంధనలు అమలు వంటి అంశాలు ఉన్నాయి. ఆయా ఫెర్టిలిటీ సెంటర్లకు నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ఉందా..? డాక్యుమెంటేషన్ అంతా పక్కాగా ఉందా..? అన్న విషయాలను నిర్ధారిస్తుంది. ఈ కేంద్రాలపై ఇది వరకు ఏమైనా కేసుల నమోదయ్యాయా..? ఏమైనా చర్యలు తీసుకున్నారా..? వీటి బారినపడి ఎవరైనా మోసపోయారా..? అన్న వివరాలను సైతం సేకరిస్తున్నాయి. అలాగే ఈ కేంద్రాలపై మెడికల్ కౌన్సిల్ ఏమైనా చర్యలు తీసుకుందా..? అన్న వివరాలను సైతం పరిశీలిస్తున్నారు.

నివేదిక తర్వాత చర్యలు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూడ్రోజులపాటు నిర్వహించిన తనిఖీల నివేదిక సర్కార్‌కు అందగానే నిబంధనలు పాటించని ఫెర్టిలిటీ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వాహకులపై చర్యలతోపాటు అవసరమైతే లైసెన్స్‌ను రద్దు చేయడం, జరిమానాలు విధించడం, న్యాయపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా కలిపి ఒకేసారి చర్యలు ఉంటాయా..? లేక గ్రేటర్‌లో మొదట ఆ తర్వాత జిల్లాల్లో చర్యలు తీసుకుంటారా..? అనేది తెలియాల్సి ఉంది.